

ప్రజా సమస్యలపై పోరాటం

- పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలి
- కాంగ్రెస్ పార్టీ జిల్లా సమావేశంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

ఏలూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి):'కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పోరాటాలు చేయండి. పార్టీ శ్రేణులు ఐక్యంగా ఉంటూ ముందుకు కదలండి' అంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి విస్తృతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు అధ్యక్షతన శుక్రవారం ఏలూరులో జరిగింది. షర్మిల మూడు గంటలపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కో-ఆర్డినేటర్ల పని తీరును అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి ఏం చేయాలో చెప్పాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మండలాలు, గ్రామాల్లో కమిటీలను నియమిస్తే పార్టీ పటిష్టం అవుతుందని చెప్పారు. దెందులూరు నియోజకవర్గంలో గత ఎన్నికలప్పుడు వైసీపీ నేతలు దౌర్జన్యం చేసి రెండుసార్లు దాడులు చేశారని, దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నామని కో-ఆర్డినేటర్ ఆలపాటి నర్సింహమూర్తి షర్మిలకు వివరించారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరారు. ప్రధాన కార్యదర్శి గౌతు సత్యేంద్ర మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని భర్తీ చేస్తే యువతను మరింతగా పార్టీ వైపు ఆకర్షించవచ్చన్నారు. మీరు పాదయాత్రలు చేస్తే పార్టీకి మరింత ఊపు వస్తుందని పలువురు నేతలు కోరారు. దీనిపై స్పందించిన షర్మిల 'ప్రజా సమస్యలపై నియోజకవర్గాల్లో ఐక్యంగా కలిసి పోరాటాలు చేస్తేనే ప్రజలు పార్టీ వైపు ఆకర్షితులవుతారు. ఆపై ఏదైనా యాత్రలు చేస్తే సక్సెస్ అవుతాయని అభిప్రాయపడ్డారు. ఎవరో నాయకులు వస్తారని ఎదురుచూడ కుండా మండల, గ్రామ కమిటీలను ఉన్న వారితో నియమించండి' అని ఆదేశించారు. నియోజకవర్గ కన్వీనర్లు ఉన్నమట్ల ఎలీజా, పెద్దిరెడ్డి సుబ్బారావు, బండి విజయభాస్కర్, బొడ్డు నోబుల్, మరీదు కృష్ణ, కిసాన్‌సెల్ రాష్ట్ర చైర్మన్ కామన ప్రభాకరరావు పాల్గొన్నారు.


ఏలూరులో కాంగ్రెస్ పార్టీ జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



వశిష్ఠ ఏటిగట్టు రహదారులు, వంతెనలకు రూ.28.03 కోట్లు

భీమవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి):వశిష్ఠ గోదావరికి ఇరు వైపులా ఏటిగట్లపై వున్న వంతెనలు, రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.28.03 కోట్లు మంజూరు చేసింది. జల వనరుల శాఖ ప్రతిపాదనలను పరిశీలించి పరిపాలన అనుమతులు ఇవ్వడంతోపాటు నిధులు కేటాయించింది. త్వరలో ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ టెండర్లు పిలిచి పనులు చేపడతారు. యలమంచిలి-బాడవ గ్రామాల మధ్య రహదారికి రూ.1.88 కోట్లు, కంచుస్తంభంపాలెం నుంచి యలమంచిలిలంక వరకు గోదావరి తనిఖీ రహదారి కోసం రూ.2.52 కోట్లు వెచ్చించనున్నారు. పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని చాకలిపాలెం నుంచి కనకాయలంక వరకు ఫుట్ ఓవర్ వంతెన నిర్మాణానికి రూ.22.83 కోట్లు, యలమంచిలి మండలం పెదలంక గ్రామ పరిధిలో రహదారి నిర్మాణానికి మరో రూ.80.80 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నిధుల కేటాయింపుతో ఏళ్ల సమస్యకు పరిష్కారం లభించింది.

పారిశుధ్యంపై తనిఖీలు చేస్తా



భీమవరం టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): 'భీమవరం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య సిబ్బంది ఉదయం ఐదు గంటలకే విధులు ప్రారంభించాలి. నేను ఆకస్మికంగా పర్యటిస్తా. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటా' అని కలెక్టర్ సీహెచ్ నాగరాణి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధి, రోడ్ల ఆక్రమణల తొలగింపు, తదితర అంశాలపై జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మునిసిపల్ అధికారులతో సమీక్షించారు. భవ్య భీమవరం ప్రాజెక్టులో భాగంగా పట్టణంలో దాతల సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేయాలి. ప్రారంభం కాని పనులు దాతలతో సంప్రదించి మొదలుపెట్టాలి. మార్జిన్లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వాటిని గుర్తించి తొలగించాలి. అనుమతి లేకుండా పెడుతున్న హోర్డింగులను తొలగించాలి. వాహనాల పార్కింగుకు ప్రదేశాలు గుర్తించాలి' అని స్పష్టం చేశారు.

లంచం అడిగితే.. ఫిర్యాదు చేయండి



నరసాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పోస్టుమార్టం సమయంలో మృతుల కుటుంబీకుల నుంచి ఇద్దరు ఉద్యోగులు రూ.3 వేలు లంచం తీసుకుని సస్పెండ్ కావడంతో నరసాపురం ప్రభుత్వాస్పత్రి అధికారులు అప్రమత్తమయ్యారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధి కార్మికుల కుటుంబాల నుంచి డిమాండ్ చేసి డబ్బులు వసూలు చేయడాన్ని జిల్లా వైద్యాధికారులు సీరియస్‌గా పరిగణించారు. శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ, సీనియర్ వైద్యులు డాక్టర్ రామకృష్ణలతో కలిసి ఆస్పత్రిలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎవరైనా లంచం అడిగినా, సరిగా స్పందించకపోయినా తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. పోస్టుమార్టం చేసేందుకు సిబ్బంది లేకపోవడంతో పాలకొల్లు నుంచి తాత్కాలికంగా రప్పిస్తున్నట్లు చెప్పారు.

డీఎస్సీ పరీక్షకు 112 మంది గైర్హాజరు

భీమవరం రూరల్/తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి):జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్ష శుక్రవారం మూడు కేంద్రాల్లో జరిగింది. 720 మంది పరీక్ష రాయాల్సి వుండగా 608 మంది హాజరయ్యారు. 112 మంది గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని డీఈవో నారాయణ తెలిపారు. పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పరీక్షల్లో 300 మందికి 260 మంది హాజరయ్యారు. 40 మంది గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపల్ రత్నాకరరావు తెలిపారు.

ఇంటర్‌పై మక్కువ తగ్గిందా ?


ఇంటర్ ప్రవేశాల గడువు మరో మూడు రోజుల్లో ముగియనుంది. గత ఏడాది జూలై వరకు అడ్మిషన్లు కొనసాగగా, ఈ ఏడాది నెల ముందుగానే జూన్ నెలాఖరు నాటికి ముగించనున్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు ప్రవేశాల్లో వెనుకబాటు కనిపిస్తోంది. జిల్లాలోని 130 ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 19,764 మంది విద్యార్థులు చేరారు. కాని 2025-26 సంవత్సరానికి ఇప్పటి వరకు 17,109 మంది మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్య 2,653 తక్కువ. మరో మూడు రోజుల్లో ఎంత మంది చేరతారనే దానిపై కళాశాలల యాజమాన్యాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

టెన్త్ ఉత్తీర్ణత పెరిగినా.. అడ్మిషన్లు అంతంతమాత్రమే

- మరో మూడు రోజుల్లో ముగియనున్న అడ్మిషన్ల గడువు
- జిల్లాలో 130 కళాశాలల్లో 17,109 మంది విద్యార్థుల చేరిక
- గత ఏడాది కంటే 2,653 తక్కువ..
- ఎక్కువ మంది చూపు పాలిటెక్నిక్ వైపు

(భీమవరం రూరల్-ఆంధ్రజ్యోతి)





ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠశాల విద్యా విధానంలో కొన్ని మార్పులు తీసుకువచ్చింది. విద్యా సామగ్రి అందించడంతో పాటు మధ్యాహ్న భోజనం అవకాశాన్ని ఈ ఏడాది జనవరి నుంచి కల్పిస్తోంది. విద్యాబోధనలోను ప్రణాళికగా సాగేలా ఏర్పాట్లు చేశారు. అయినప్పటికి అడ్మిషన్ల పరంగా వెనుకబాటు కనిపిస్తోంది. జిల్లాలో 15 ప్రభుత్వ కళాశాలలు, రెండు ఎయిడెడ్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో గత ఏడాది 2,223 మంది విద్యార్థులు చేరారు. ప్రస్తుతం 1,819 మంది విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారు. ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల చేరిక ఎక్కువ ఉంటుందని అంచనా వేశారు. కాని, గత ఏడాదికంటే తక్కువగానే కనిపిస్తోంది. మిగిలిన వ్యవధిలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల ద్వారా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇప్పుడిప్పుడే అడ్మిషన్లు తీసుకుంటున్నారు.

పెరిగిన టెన్త్ ఉత్తీర్ణత

రెండేళ్లుగా చూస్తే ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. 2022-23 విద్యా సంవత్సరంలో 45 శాతం. 2023-24లో 50 శాతంలోపు ఉత్తీర్ణత సాధిస్తే 2024-25లో 72 శాతం మంది అంటే 9,200 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఇంటర్‌లో చేరే విద్యార్థుల సంఖ్య గడిచిన రెండేళ్ళకంటే ఈ ఏడాది పెరుగుతుందని ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు అంచనా వేశాయి. ప్రస్తుత గణాంకాలను బట్టి చూస్తే ఆ పరిస్థితి కనిపించడం లేదు.

పాలిటెక్నిక్ వైపు విద్యార్థుల చూపు

విద్యార్థుల్లో అధిక శాతం మంది పాలిటెక్నిక్ కోర్సుల మీద మక్కువ చూపిస్తున్నారు. దీని ప్రభావం ఇంటర్మీడియట్ అడ్మిషన్లపై కనిపిస్తోంది. ఈ ఏడాది పాలిటెక్నిక్‌లో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. ఉమ్మడి పశ్చిమలో నాలుగు వేల మంది వరకు పాలిసెట్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఒక ప్రభుత్వ కళాశాల, ఎనిమిది ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 3,200 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పాలిసెట్ ఫలితాలను బట్టి సీట్ల భర్తీ పెరిగే అవకాశం ఉంది. వీరిలో ఎక్కువ మంది ఇంటర్‌లో చేరాలనుకుని పాలిటెక్నిక్ వైపు మక్కువ చూపినవారే. పాలిసెట్ కౌన్సెలింగ్ ముందస్తుగానే రావడం వచ్చే నెల 3న సీట్లు కేటాయించడం, పాలిటెక్నిక్‌లో చేరాలనుకునే విద్యార్థులకు మంచి అవకాశంగా మారింది.

ఒకటో తరగతిపై ఒత్తిడి

ఎల్‌కేజీ, యూకేజీ పిల్లల క్లాస్‌లు మార్చాలని తల్లిదండ్రుల అభ్యర్థన

- లేకుంటే స్కూల్ మార్చేస్తాం.. తల్లికి వందనం పథకం కోసం పక్కచూపులు
- విద్యా శాఖ అధికారులపై ఒత్తిడి తెస్తున్న ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)



తల్లికి వందనం పథకం ఒకటి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుంది. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు వర్తించదు. కాని, తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలపై ఒత్తిడి తెచ్చి తమ పిల్లలను ఒకటో తరగతిలోకి మార్చాలని, లేకుంటే స్కూల్స్ మార్చేస్తామని ఒత్తిడి తెస్తున్నారు. ప్రస్తుతం రెండు నుంచి పదో తరగతి వరకు అర్హులైన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో సొమ్ములు జమ చేసింది. జిల్లావ్యాప్తంగా 1,76,574 మంది తల్లికి వందనం పథకానికి అర్హత సాధించారు. రూ.250 కోట్లు తల్లుల ఖాతాలో ప్రభుత్వం సొమ్ములు జమ చేసింది. మరో 46 వేల మంది విద్యార్థులను అనర్హుల జాబితాలో చేర్చారు. వారిలో 20 వేల మంది తాము అర్హులమేనంటూ సచివాలయాల్లో తగిన పత్రాలు సమర్పించారు. మరోవైపు ఒకటో తరగతిలో దాదాపు 20 వేల చేరే అవకాశం ఉంది. వీరందరికి సొమ్ములు జమ కానున్నాయి.

ఒకటో తరగతిలోకి మార్చండి

ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ చదువుతున్న విద్యార్థులను ఒకటో తరగతిలోకి మార్చాలని తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తున్నారు. లేకుంటే పాఠశాలలు మార్చేస్తామని బెదిరిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల సంఖ్యను పెంచుకోవడానికి పలు పాఠశాలల యాజమాన్యాలు విద్యా శాఖ సిబ్బందిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి సిబ్బంది ససేమిరా అంటున్నారు. ఇది వరకే ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల వివరాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకునే పిల్లల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేశారు. తల్లికి వందనం వర్తించేందుకు ఒకటో తరగతిలో అడ్మిషన్‌లు కల్పిస్తే సిబ్బంది బలి కానున్నారు. తల్లిదండ్రులకు దీనిపై అవగాహన లేకపోతోంది. వయస్సు సరిపోతుంది కాబట్టి ఒకటో తరగతిలో చేర్చాలని పేర్కొంటున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలి. లేదంటే తల్లికి వందనంలో ప్రభుత్వంపై అదనపు భారం పడనుంది.

చుక్క చుక్కలో విషం !

- చెత్తా చెదారం, ఆక్వా వ్యర్థాలతో బొండాడ కాలువ
- తాగునీటికి ప్రజల పాట్లు.. డిప్యూటీ స్పీకర్ ఆగ్రహం



మాలవానితిప్ప వద్ద పంట కాలువ గట్టే చెరువు గట్టు..
ఆనందపురం వద్ద గుర్రపు డెక్కతో నిండిన కాల్వ

కాళ్ళ, జూన్ 27(ఆంధ్రజ్యోతి):కాళ్ల మండలంలో పది శివారు గ్రామాలకు తాగు, సాగు నీరందించే బొండాడ పంట కాలువ కలుషితమైంది. జక్కరం నుంచి మాలవానితిప్ప శివారు గోగుతిప్ప వెళ్లే సరికి గట్లు కుచించుకుపోయాయి. ఇది కాలువా ? లేక పంట బోదెనా ? అనే విధంగా తయారైంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పంట కాలువను చేర్చి చేపల చెరువులు తవ్వారు. వీటిని చూస్తే ఏది కాలువ గట్టు.. ఏది చెరువు గట్టో అర్థం కాదు. అప్పట్లో నిబంధనలకు విరుద్ధంగా ఈ చెరువులు తవ్వుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. కాలువను ఆనుకుని పలుచోట్ల ఇళ్లు, పెద్ద షెడ్లు నిర్మించారు. దీంతో కాలువ పక్కన నివసించేవారు తమ ఇళ్లల్లోని చెత్తను కాలువలో వేస్తున్నారు. ఆక్వా చెరువుల నీటిని కాలువలోకి వదిలేస్తున్నారు. కొన్ని గ్రామాల్లోని మురుగునీరు ఈ కాలువలో కలిపేస్తున్నారు. దీనివల్ల శివారు గ్రామాలకు తాగు నీరందించే బొండాడ పంట కాలువ పూర్తిగా కాలుష్యమయమైంది. ఆక్వా చెరువులు, చెత్త తదితరాలు కాలువలోకి వదలడమే ఇందుకు ప్రధాన కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు.

డిప్యూటీ స్పీకర్ ఆగ్రహం

మాలవానితిప్ప పర్యటన సందర్భంగా ఇటీవల డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు పంట కాలువని చూసి విస్మయం వ్యక్తం చేస్తూ అధికారులు నీటి సంఘాల

(మిగతా 8వ పేజీలో)

కిల్లర్ సింహాద్రికి జీవిత ఖైదు



- ప్రసాదంలో సైనేడ్ కలిపి 20 నెలల్లో పది హత్యలు
- పోలీసుల దర్యాప్తుతో వెలుగులోకి..
- 2019.. వడ్లమానులో వ్యక్తి హత్య.. నేరం నిరూపణ కావడంతో శిక్ష విధిస్తూ విజయవాడ కోర్టు తీర్పు

7

చేపల వేటకు వెళ్లి ముగ్గురి మృతి



- నీటిగుండంలో మునిగిన ఇద్దరు అన్నదమ్ములు సహా మరొకరు
- ఒకరిని కాపాడే ప్రయత్నంలో మరో ఇద్దరు మృత్యువాత
- చినరవ్వారిగూడెం గిరిజన కుటుంబాల్లో విషాదం
- కుటుంబ సభ్యుల కన్నీరుమున్నీరు

7

ఎండాకాలం పనులు.. వానా కాలంలోనా ?

నరసాపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో 'ఆంధ్రజ్యోతి' ప్రకంపనలు

- అధికారుల పనితీరుపైనా సభ్యుల ధ్వజం


సమస్యలపై స్వపక్ష, విపక్ష కౌన్సిలర్ల వాగ్వాదం.. సర్ది చెబుతున్న చైర్‌పర్సన్ వెంకటరమణ

నరసాపురం టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి):డ్రైనేజీల్లో సిల్ట్ తొలగింపు పనులపై ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన 'వానా కాలంలో బురద పనులు' కథనంపై శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో స్వపక్ష, విపక్ష సభ్యులు అధికారులపై విరుచుకుపడ్డారు. చైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీసీలు కామని నాగిణి, కొత్తపల్లి నాని, వైసీపీ కౌన్సిలర్లు సఖినేటిపల్లి సురేష్, వన్నెంరెడ్డి శ్రీను, బొంతు రాజశేఖర్, స్వతంత్ర సభ్యులు కోటిపల్లి సురేష్, వైకేఎస్‌లు సిల్ట్ పనులపై మండిపడ్డారు. ఎండా కాలంలో చేయాల్సిన పనులను వానా కాలంలో చేయడంతో తీసిన సిల్ట్ తీసినట్లే డ్రెయినేజీల్లోకి జారిపోతోందని, రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయని మండిపడ్డారు. ఈ పనులకు బిల్లులు సభ్యులు సంతకాలు పెట్టిన తర్వాతే కాంట్రాక్టర్లకు చెల్లించాలన్నారు. ఇటు అధికారులు నిబంధనలకు అనుగుణంగా డ్రైనేజీల్లో సిల్ట్ తీశారా ? లేదా ? అన్న విషయాన్ని పరిశీలించాలన్నారు.

సిల్ట్ కార్మికులకు స్కూళ్లు ఇస్తారా...?

సిల్ట్ తొలగించేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ స్కూళ్లల్లో ఎలా వసతి కల్పించారంటూ వీసీ కామన నాగిణి నిలదీశారు. దీనిపై కమిషనర్ అంజయ్య సరైన సమాధానం ఇవ్వకపోవడంతో పోడియం వద్ద బైఠాయించారు. ఈ క్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ కేసరి గంగరాజు, కోటిపల్లి సురేష్ వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారు. దీనికి నాగిణి అభ్యంతరం తెలిపారు. అధికారులు సమాధానం చెప్పాలి గాని మధ్యలో మీరేంటి అని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. చైర్‌పర్సన్ అధ్యక్షత స్థానం నుంచి బయటకు వెళ్లిపోయారు. మిగిలిన కౌన్సిలర్లు ఇరుపక్షాలకు

(మిగతా 8వ పేజీలో)

5న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్

- ప్రభుత్వ పాఠశాలలతోపాటు ఈసారి ప్రైవేట్‌లోనూ నిర్వహణ
- తల్లికి ప్రాముఖ్యత తెలిపేలా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు
- గత ఏడాది టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన వారికి పిలుపు

భీమవరం రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాలు పెంచే లక్ష్యంతో వచ్చే నెల ఐదో తేదీన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహించనుంది. జిల్లాలోని 1,392 ప్రభుత్వ, 374 ప్రైవేట్ పాఠశాలల్లో రెండు లక్షల 30 వేల విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది మాదిరి పాఠశాలలను అందంగా ముస్తాబు చేసి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తారు. వారి సలహాలు, సూచనలు తీసుకుంటారు. విద్యా బోధన విధి విధానాలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరిస్తారు. తల్లులకు ముగ్గులు, లెమన్ స్పూన్ పోటీలు పెడతారు.

ఈసారి మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ బయటకు తెచ్చేలా పోటీలు నిర్వహించనున్నారు. ఇటీవల తల్లికి వందనం పథకం విడుదల చేశారు. దీనిలో భాగంగా తల్లి ప్రాముఖ్యత తెలిపే విధంగా డ్రాయింగ్, గీతాలాపన వంటి పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. గత విద్యా సంవత్సరంలో టెన్త్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు లభించిన విద్యార్థులను ఆహ్వానిస్తున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకోవాలని ఇప్పటి విద్యార్థులకు సూచనలు ఇస్తారు. ప్రతిభ కనబర్చిన వారిని అభినందిస్తారు.





తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌కు మహర్దశ

రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు

మూడో ఆర్‌వోబీ, రెండు అండర్‌పాస్‌ల నిర్మాణం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌కు కొత్త రూపు రానుంది. ఏళ్ల తరబడి పట్టణ, పరిసర ప్రాంతవాసులను వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యతో పాటు అత్యంత రద్దీగా ఉండే రైల్వే గేట్‌లకు అండర్ పాస్‌లకు రైల్వేశాఖ నిధులు కేటాయించింది..ఇప్పటికే రైల్వేస్టేషన్‌కు అమృత్ భారత్ పథకం కింద స్టేషన్‌లో పలు అభివృద్ధి పనులు శర వేగంగా సాగుతుండగా వాటికి తోడు మూడో ఫ్లైఓవర్, రెండు అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్ట నున్నారు. ఈ పనులన్నీ పూర్తయితే గూడెం రైల్వేస్టేషన్ కొత్తరూపు సంతరించుకుంటుంది.

దశాబ్దాల చరిత్ర

తాడేపల్లిగూడెం రైల్వే అంటే వ్యాపార కూడలికి పెట్టింది పేరు. స్వాతంత్రోద్యమ కాలంలో కూడా తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్ సేవలందించింది. ఐదు దశాబ్దాల క్రితం అప్పటి ఎమ్మెల్యే ఈలి ఆంజనేయులు హయాంలో పోలీస్ ఐలాండ్ వద్ద తొలిసారిగా మొదటి ఫ్లైవోవర్ నిర్మించారు. కడకట్ల యాగర్లపల్లి, పడాల ప్రాంతాలను కలుపుతూ 15 ఏళ్ల క్రితం ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ రెండో ఫ్లైఓవర్ నిర్మించారు. తరువాత అధికారంలోకి వచ్చిన నాయకులు మూడో ఫ్లైఓవర్ నిర్మించాలని ప్రయత్నించినా అవి సాధ్యం కాలేదు. ఆ కల నేటికి అలానే మిగిలిపోయింది.

రూ.300 కోట్లతో అభివృద్ధి

తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అభివృద్ధి పనులకు రూ.300 కోట్లు విడుదల చేయించడంలో కీలకంగా వ్యవహరించారు. వాటిలో మూడో ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.110 కోట్లు, ఇతర పనులకు నిధులు మంజూరు చేశారు.రూ.110 కోట్లతో ఏలూరు కాలువ మీదుగా జువ్వలపాలెం కుంచనపల్లి ప్రాంతాలు కలుపుతూ వంతెన నిర్మాణం చేపట్టేందుకు ప్రణాలికలు సిద్ధం చేశారు. దీని కోసం ఇటీవల రైల్వే అధికారులు, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఫ్లైఓవర్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. వాటితో పాటు తాడేపల్లిగూడెం మండలం నవా బుపాలెం వద్ద రూ.67 కోట్లతో ఒక ఆర్‌వోబీ, మారంపల్లి వద్ద రూ.63 కోట్లతో మరో ఆర్‌వోబీ నిర్మాణానికి నిధులు విడుదల చేశారు. ఇంకా వాటితో పాటు గూడ్స్ షెడ్, రైల్వే అభివృద్ధి పనులు చేయనున్నారు.

శరవేగంగా స్టేషన్ అభివృద్ధి

అమృత భారత్ పథకం ద్వారా తాడేపల్లిగూడెం రైల్వేస్టేషనన్ అభివృద్ధికి ఇప్పటికే కేంద్రం రూ.24 కోట్లు నిధులు విడుదల చేయడంతో పాటు ఆయా పనులు శరవేగంగా సాగు తున్నాయి. 1,2,3 ప్లాట్‌ఫాంల అభివృద్ధి, ఎస్క. లేటర్, మోడ్రన్ ఏసీ వెయిటింగ్ రూం, సీవోపీ, ఎలివేషన్ మార్పు తదితర పనులు చేపట్టారు.

కదిలిన జగన్నాథుని రథచక్రాలు

లక్ష్మీపురం ఆలయంలో ప్రారంభమైన జగన్నాథ రథోత్సవాలు

ద్వారకాతిరుమల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జగన్నాథుని దివ్య రథచక్రాలు లక్ష్మీపురం ఆలయం నుంచి శ్రీవారి క్షేత్రం వైపునకు కదిలాయి. శుక్రవారం సాయంత్రం శోభాయమానంగా జరిగిన ఈ రథయాత్రను వీక్షించిన భక్తజనులు పరవశించారు. పురాతనమైన ఈ ఆలయం శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయంగా విరాజిల్లుతోంది. జగన్నాథుని రథోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమై వచ్చేనెల 6 వరకూ జరుగనున్నాయి. ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని, పరిసరాలను పుష్పమాలికలు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపతోరణాలతో సుందరీకరించారు.

రథయాత్ర సాగిందిలా..

అర్చకుల వేదమంత్రోచ్చరణల నడుమ ఒడిశా రాష్ట్రం పూరీ క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్ర, బలభద్ర, సమేత జగన్నాథుని దారు విగ్రహాలను అట్టహాసంగా కోవెల నుంచి తెచ్చి రథంలో ఏర్పాటు చేసిన సింహాసనంపై ఉంచి అలంకరించారు. ఆలయ అధధికారుల పూజల అనంతరం బలిహరణ సమర్పించి రథయాత్రను ప్రారంభించారు. మేళతాళాలు, సన్నాయి డప్పు వాయిద్యాలు, అర్చకులు, కోలాట భజనల నడుమ జగన్నాథ రథయాత్ర ద్వారకా తిరుమల క్షేత్రానికి చేరుకుంది. ప్రతి ఇంటి ముందు స్వామివారికి భక్తులు హారతులు పట్టారు. క్షేత్రంలో తిరుగాడిన అనంతరం రథం తిరిగి లక్ష్మీపురం చేరుకుంది.





మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథుడు

మత్స్యావతారంలో జగన్నాథుడు

మత్స్యావతారంలో జగన్నాథుడు శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఏడాది పూరి క్షేత్రం నుంచి తెచ్చిన దారు విగ్రహాలను దశావతారాలుగా చేయడం ప్రధాన ఆకర్షణగా మారింది. లక్ష్మీపురం ఆలయంలో జగన్నాథస్వామి రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఇందులో భాగంగా తొలిరోజున మత్స్యావతారంలో శంఖు, చక్రాలను ధరించి, గదాధారియై సుభద్ర, బలభద్రులతో కలసి భక్తజనులకు అభయహస్తాన్ని ప్రసాదిస్తున్నట్లుగా చేసిన అలంకారం చూపరులకు కనువిందు చేసింది. ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వడాలిలో రథోత్సవం

ముదినేపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో జగన్నాథస్వామి రథయాత్ర శుక్రవారం వైభవంగా జరిగింది. సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర సుమారు 20 కిలోమీటర్ల దూరం సాగింది. భక్తుల జయ జయ ధ్వానాలు, మంగళ వాయిద్యాల మధ్య రథయాత్ర సాగింది. ముదినేపల్లి, పెయ్యేరు ఆటోనగర్, శ్రీహరిపురం, సింగరాయ పాలెం బావాజీ మఠం మీదుగా వడాలి చేరుకుంది.టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, ఎస్‌ఐ వీరభద్రరావు, అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు స్వామివార్లకు పూజలు జరిపారు. గరగ, కేరళ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.





రథయాత్రలో వేషధారణలు



బురద రోడ్డులో దిగబడిన పామాయిల్ లారీ

నాలుగు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం

టి.నర్సాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అప్పలరాజుగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళ్తున్న ఆయిల్‌పామ్ గెలల లారీ శుక్రవారం రోడ్డుపై గోతుల్లో దిగబడింది. మలుపు కావడంతో ఈ లారీని తియ్యడానికి మరో పామాయిల్ లారీ వచ్చి అది కూడా ఇరుక్కు పోయింది. దీంతో ఆ దారిలో పూర్తిగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నాలుగు గంటల పాటు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. స్థానికులు ఆయిల్‌పామ్ కంపెనీ వారు చొరవతో దిగబడిన లారిని తీసి రాకపోకలను పునరుద్ధరించారు.

రోడ్లు.. తూట్లు

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి.. గ్రామాల్లో రోడ్లు బురదమయంగా మారి వాహనాలు జారడంతో గాయాలపాలవుతున్నారు. కొన్ని రహదారులు పెద్దపెద్ద గోతులు పడి చెరువులను తలపిస్తున్నాయి..



అధ్వాన్నంగా తాడేపల్లిగూడెం గూడ్స్ షెడ్డు వంతెన

గోతులమయంగా గూడ్స్ షెడ్డు రోడ్డు

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆ వంతెనకు ఎంతో చరిత్ర ఉంది. బ్రిటీష్ పరిపాలన హయాంలో నిర్మాణం చేసిన వంతెన ఇది. పట్టణంలో ఉన్న ప్రధాన వంతెనలలో ఇది కూడా ఒకటి. అటువంటి వంతెన నేడు ఆదరణకు నోచుకోకుండా శిథిలావస్థకు చేరుకుంది. తాడేపల్లిగూడెం పట్టణం నడి బొడ్డున ఉన్న గూడ్స్ షెడ్డు వంతెన ఎన్నో ఏళ్లుగా ప్రజల అవసరాలను తీరుస్తోంది. తొలుత ఈ వంతెన పైనుంచే గూడ్స్ షెడ్డుకు లోడ్ లారీలు వెళ్తుండేవి. కాలక్రమేణ ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెన పైనుంచి పెద్ద లారీలు వెళ్ళడం ప్రమాదకరమనిపైన బారికేడ్ వేశారు. లారీలు వెళ్లేందుకు అనుకూలంగా మరో వంతెన నిర్మించారు. ప్రస్తుతం ఈ వంతెనపై కార్లు, మోటర్ సైకిళ్లు మాత్రమే వెళు తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన మొత్తం గతుకులతో ఛిద్రమైంది. వంతెన మాత్రమే కాదు వంతెన దాటిన తరువాత వార్ఫు రోడ్డు మొత్తం అధ్వానంగా తయారైంది. వంతెన కింద పిచ్చిమొక్కలు పెరిగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణాలు సాగించే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలందరికి అవసరమైన వంతెన ప్రమాదకరంగా తయారవడంతో వాహనదారులు, వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వంతెన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



బురదమయంగా గొల్లలకోడేరు -మహదేవపట్నం రహదారి

ఈ దారిలో వెళితే జారి పడతారు..

పాలకోడేరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : గొల్లలకోడేరు- మహదేవపట్నం గ్రామానికి వెళ్ళే రహదారి బురదమయమై జారుడు బల్లలా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గొల్లలకోడేరు గ్రామం మీద నుంచి మహదేవపట్నం, ఉండి వెళ్ళేందుకు ఇది ఎంతో అనువైన మార్గం. పంట పొలాల మధ్యలో నుంచి గొల్లలకోడేరు గ్రామం నుంచి మహదేవపట్నం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ రహదారి ఉంది. ఈ రహదారికి గత ఐదు సంవత్సరాలుగా ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో గొల్లలకోడేరు పరిధిలో ఉన్న రహదారి పూర్తిగా పాడైపోయింది. గోతులు పడి బురదమయంగా మారింది. ఈ వేసవిలో మట్టి ట్రాక్టర్లతో ట్రాక్టర్ల ద్వారా, లారీలతో మట్టిని తోలుకెళ్ళడంతో రహదారిపై మట్టిబెడ్డలు పడి జారుడు బల్లలా తయారైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు జారిపడి గాయాలపాలయ్యారు. ఈ రహదారి వెంబడి పంట పొలాలతోపాటు సీతారామపురం, తమ్మగుంటపాలెం, తోడిగుల్లవారిపాలెం, గుబ్బలవారిపాలెంలలో ప్రజలు నివసిస్తారు. నిత్యం వారంతా ఈ రహదారి మార్గం మీదే ప్రయాణాలు సాగించాల్సి ఉంటుంది. గొల్లలకోడేరు ప్రాంత వాసులే కాకుండా ఉండి మండల ప్రజలు కూడా ఈ రోడ్డుకు మోక్షం కల్పించాలని కోరుతున్నారు.



దిప్పకాయలపాడు రాతిచెరువు వద్ద అధ్వానంగా ఉన్న రహదారి

ఈ రోడ్డుకు మోక్షం కలిగేనా..?

కొయ్యలగూడెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం నుంచి కన్నాపురం వెళ్తే రహదారి పూర్తిగా పాడై అధ్వానంగా తయారైంది. వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కన్నాపురం వరకు సుమారు 7 కిలోమీటర్లు మేర వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.నాలుగు సంవత్సరాలుగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోవడం లేదు. కొయ్యలగూడెం నుంచి పోలవరం వెళ్లడానికి అదే విధంగా కేఆర్.పురం ఐటీడీఏకి వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. నిత్యం వేలాది వాహనాలు ఈ రహదారి గుండా వెళ్తాయి. ఈ రహదారి దుస్థితి పట్టించుకోవాలంటూ వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.

దారి చూపించండి సారూ..!

బురద రోడ్డులో విద్యార్థుల అవస్థలు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పది గ్రామాలకు ఒకటే జూనియర్ కళాశాల. ఆ కళాశాలకు వెళ్లాలంటే పుంతరోడ్డే దిక్కు. ఆ రోడ్డులోనే విద్యార్థులు కళాశాలకు వెళ్లాల్సిన పరిస్థితి. గతంలోనూ ఇదే విధంగా విద్యార్థులు నకర యాతన అనుభవించారు. ప్రస్తుతం ప్రభుత్వం రోడ్లు వేస్తుంటంతో ఆ దారిని బాగుచేయాలని విద్యార్థులు వేడుకుంటున్నారు. ఆ దారిన వర్షం వస్తే వెళ్లేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. కళాశాలలో 70 మంది విద్యార్థులు చదువుతుంటే వర్షం వచ్చిన రోజు 30 మంది లోపే కళాశాలకు రావడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.



మాధవరం కళాశాలకు వెళ్లే దారి దుస్థితి



చెరువులా ఉన్న ఇటుకలకోట-పోలవరం ఏజెన్సీ రోడ్డు

చెరువుల్ని తలపిస్తున్న ఏజెన్సీ రోడ్లు

పోలవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో పోలవరం ఇటుకలకోట, గుంజవరం ఏజన్సీ గ్రామాల రోడ్లు వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై వర్షపు నీరు నిలవడం వల్ల ఎక్కడ గోతులున్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం వర్షాలకు తానాలకుంట కల్వర్టు కొట్టుకుపోగా ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారింది. గత ప్రభుత్వం గడిచిన నాలుగేళ్ళలో ఈ కల్వర్టు పునరుద్ధరణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధి బుగ్గా మురళి తన సొంత ఖర్చులతో తాత్కాలికంగా రాక పోకలు సాగించేందుకు మార్గం వేశారు. ఇటీవల వర్షాలకు ఆ కల్వర్టు మళ్ళీ ప్రమాదకర స్థాయిలో కోతకు గురయ్యింది. కచేరి సెంటర్ నుంచి రేపల్లెవాడ జంక్షన్ వరకూ 9 కిలోమీటర్ల మేర రోడ్లు అస్తవ్యస్తంగా మారి ప్రజానీకం ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గంలో నిత్యం పోలవరం నుంచి బుట్టాయి గూడెం రాకపోకలు సాగించే ఆర్టీసి బస్సులు సైతం గోతుల్లో నిలిచి మొరాయిస్తున్నాయి. ఈ మార్గంలో పోలవరం నుంచి ఇటుకలకోట, వింజరం, చేగొండపల్లి, శింగన్నపల్లి, బోడిగూడెం, గార్లగొయ్యి, మామిడిగొంది, రామన్నపాలెం, కొత్తరామయ్యపేట గ్రామాల నుంచి జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కోట రామచంద్రపురం, బుట్టాయిగూడెం ప్రాంతాలకు చదువుల కోసం విద్యార్థులు, ఉద్యోగ విధుల నిర్వహణ కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు, రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అంతేగాక ఆ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాల బారినపడి గాయాలపాలవుతు న్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై రహదారులు భవనాలశాఖ డిప్యూటి ఇంజనీరు హరికృష్ణను వివరణ కోరగా పోల వరం కచేరి రోడ్డు నుంచి గుంజవరం వరకూ రోడ్ల నిర్మాణానికి, తానాలకుంట కల్వర్టు నిర్మాణానికి రూ.8 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి నివేదిక పంపామని నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.



చెరువును తలపిస్తున్న మూల్లంక -పెదలంక రహదారి

భారీ వర్షాలతో రహదారి ధ్వంసం

కలిదిండి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తుండటంతో మూల్లంక- పెదలంక ప్రధాన రహదారి సుమారు 7 కిలోమీటర్ల మేర పెద్ద గోతులు పడి ధ్వంసమైంది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.లోడు వాహనాలు రోడ్డుపై గోతుల్లో దిగబడుతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. బస్సులు, ఆటోలు సక్రమంగా రావడం లేదు. మూల్లంక పీహెచ్‌సికి వెళ్లటానికి వృద్ధులు, గర్భిణులు,పిల్లల తల్లులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి మరమ్మతులు చేయాలని విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..



విజయరాయిలో ఆందోళన చేస్తున్న కోకో రైతులు

కోకో గింజలు కొనుగోలు చేయాలి

గిట్టుబాటు ధర చెల్లించాలి.. రైతు సంఘం డిమాండ్

పెదవేగి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రైతుల దగ్గర నిల్వ ఉన్న కోకో గింజలను పూర్తిగా కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని కోకో రైతు సంఘం విజ్ఞప్తి చేసింది. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా కోకో గింజలకు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. విజయరాయిలో శుక్రవారం కోకో రైతులు సమావేశమై కోకో గింజల కొనుగోలుపై నిరసన వ్యక్తంచేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో గింజల కొనుగోలు కంపెనీలు రైతుల దగ్గర నుంచి గింజలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు తీసుకోవడంలేదని, వచ్చేనెల 15 వరకు ప్రభుత్వం అందిస్తున్న రూ.50 ప్రోత్సాహకంతో కిలో రూ.500 చెల్లించి కొనుగోలు చేసేలా ఆయా సంస్థలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అనంతరం పెదవేగి పామాయిల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆయిల్‌పామ్ రైతులు చేస్తున్న పోరాటానికి కోకో రైతు సంఘం తరపున సంఘీభావం తెలిపారు. పామాయిల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని సంఘం విజ్ఞప్తి చేసింది. కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, విజయరాయి ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం నాయకుడు పాలడుగు నరసింహారావు, రైతులు గుడిబండి వీరారెడ్డి, కోనేరు సతీష్‌బాబు, రాపర్ల తేజకృష్ణ, ఆలపాటి వాసు, వై.శ్రీనివాసరావు, బొప్పన మునీశ్వరరావు, బింగి శ్రీను, పావులూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోకో విక్రయ రైతులు దరఖాస్తు చేసుకోండి

ఏలూరు సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రాయితీ ద్వారా కోకో విక్రయించే రైతులు ఈనెల 30లోగా ఉద్యాన శాఖకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎస్.రామ్మోహన్ శుక్రవారం తెలిపారు. కేజీకి రూ.50 చొప్పున ప్రభుత్వ రాయితీతో కేజీ రూ.500 ధరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయిందన్నారు. కోకో రైతులు ఉద్యావన శాఖ వద్ద పేర్లను నమోదు చేసుకుంటే కంపెనీ వారికి విక్రయించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1536 మెట్రిక్ టన్నుల కోకో గింజలను మొండేలైజ్, డీపీ, చాకొలేట్, ఇతరుల ద్వారా కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతులంతా ఈనెల 30లోపు రైతు సేవా కేంద్రాలలో పర్మిట్స్ తీసుకుని సమీపంలో గల కంపెనీలకు విక్రయించుకోవచ్చని ఉద్యావన శాఖాధికారి రామ్మోహన్ సూచించారు.



పుట్లగట్లగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే సర్వీసు రోడ్డు వద్ద రాస్తారోకో

గ్రీన్ ఫీల్డ్ హైవే నుంచి పొలాలకు దారివ్వాలి

» పుట్లగట్లగూడెం వద్ద రైతుల నిరసన

జంగారెడ్డిగూడెం,జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్లగట్లగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పనులను శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. రహదారిపై టెంట్ వేసి రాస్తారోకో నిర్వహించారు. హైవే రోడ్డు పనులు పూర్తయిన తర్వాత పొలాలకు వెళ్లే రహదారి నిర్మించి ఇస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు దారి మూసివేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రైతులు దుక్కి దున్ని వరినాట్లు వేసే సమయం కావడంతో పొలాల్లోకి వెళ్లడానికి దారిలేక ఇబ్బందులు పడుతున్నట్లు మాజీ జడ్పీటీసీ, రైతు శీలం రామచంద్రరావు, వైసీపీ మండల అధ్యక్షుడు, రైతు వామిశెట్టి హరిబాబు తెలిపారు. గత మూడేళ్లుగా జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు వినతులు సమర్పిస్తున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. వరద నీరు, కొంగలచెరువు నుంచి వచ్చే వరద నీరు వెళ్లే దారి కూడా మూసివేయడంతో పంటలను ముంచి వేస్తున్నాయని రైతులు తెలిపారు. ఎంపీ పుట్టా మహేశ్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. రైతుల రాస్తారోకో కారణంగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమంలో రైతులు గొల్లపూడి శ్రీనివాసరావు, శీలం వెంకటరాజు, బొచ్చు శ్రీను, పళ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో

నిందితుడికి 20 ఏళ్ల జైలు

» ఏలూరు పోక్సో కోర్టు తీర్పు

ఏలూరు క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ ఏలూరులోని పోక్సో కోర్టు జడ్జి కె.వాణిశ్రీ శుక్రవారం రాత్రి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జంగారెడ్డిగూడెంలోని ఒక ప్రాంతానికి చెందిన బాలిక (8)పై సుబ్బదేవిపేట కాలనీలో ఉండే షేక్ ఇబ్రహీం (45) లైంగిక దాడికి పాల్పడ్డాడు. మెడికల్ షాపు నిర్వహించే ఇబ్రహీం రోజు పాఠశాల నుంచి తిరిగి వెళ్లే బాలికకు తినుబండారాలు ఇచ్చి తరచుగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. రోజూ బాలిక ఆలస్యంగా రావడంతో నాయనమ్మ బాలికను ప్రశ్నించింది. ఇబ్రహీం ఎలా ప్రవర్తించాడో బాలిక చెప్పడంతో నాయనమ్మ 2024 ఫిబ్రవరి 10న జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి జంగారెడ్డిగూడెం ఎస్‌ఐ జి.జ్యోతిబస్ కేసు నమోదు చేయగా డీఎస్పీ ధనుంజయుడు కేసు దర్యాప్తు చేసి షేక్ ఇబ్రహీంను అరెస్టు చేశారు. ఈకేసు ఏలూరులోని పోక్సో కోర్టులో ఏడాదిన్నరలోనే విచారణకు వచ్చేలా పోలీసులు కృషి చేశారు. విచారణలో షేక్ ఇబ్రహీంపై నేరం రుజువు కావడంతో అతనికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. బాలికకు రూ.50 వేల పరిహారం అందించాలని జడ్జి వాణిశ్రీ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమర శ్రీనివాస్ వాదించగా ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఎం.సుబ్బారావు, జంగారెడ్డిగూడెం సీఐ ఎంవి సుభాష్, ఎస్‌ఐ ఎస్‌కె జాబీర్, సిబ్బంది సహకరించారు. నిందితుడికి శిక్ష పడడంలో సహకరించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అభినందించారు.

30 నుంచి ప్రత్తిపాడు రైల్వే గేటు మూసివేత

పెంటపాడు / తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రత్తిపాడు నుంచి తాడేపల్లిగూడెం రూరల్ మండలం ఆరుగొలను వెళ్లే రైల్వే గేటు ఈ నెల 30న మూసివేయనున్నారు. మరమ్మతు పనులలో బాగంగా ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4 వరకూ ఐదురోజుల పాటు గేటును మూసివేస్తున్నట్లు తాడేపల్లిగూడెం రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎస్‌వీకే. వర్మ తెలిపారు.





ఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రభాకర్..క్షతగాత్రులతో మాట్లాడుతున్న పెదవేగి సీఐ

రాజీకి వెళితే చితక్కొట్టారు

దెందులూరు సమీపంలో దాబా దగ్గర ఘటన

బాధ్యులపై కఠిన చర్యలకు ఎమ్మెల్యే ఆదేశం

పెదవేగి, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : గత ఆదివారం జరిగిన వివాదంలో ముగ్గురు వ్యక్తులను కొట్టిన సంఘటనలో నిందితులు విద్యార్థులు కావడంతో పెద్దల చొరవతో వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఇరు వర్గాలు నిర్ణయించాయి. దీనికోసం శుక్రవారం ఉదయం నిందితులు తల్లిదండ్రులతో కలిసి దెందులూరు వెళ్లారు. ఆ సమయంలో దెందులూరుకు చెందిన కొంతమంది ఇద్దరు వ్యక్తులపై విచక్షణారహితంగా దాడిచేసి గాయపర్చారు. వివరాల్లోకి వెళ్తే యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెనుబోయిన మహేష్‌యాదవ్ గత ఆదివారం పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మ ఆలయం దగ్గర జరిగిన శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా రాయన్నపాలెం గ్రామానికి చెందిన కొంతమంది యువకులతో ఘర్షణ జరిగింది. దీంతో ఆ యువకులు రాయన్నపాలెం నుంచి కారును వెంబడించి విజయరాయిలో కారును అడ్డగించి కారును ధ్వంసం చేసి, కారులో ఉన్న మహేష్‌యాదవ్‌తో పాటు టీడీపీ మైనార్టీసెల్ జిల్లా నాయకుడు షేక్ జహీర్ అహ్మద్,కారు డ్రైవర్ చంద్రసూర్యలపై దాడిచేసి కొట్టారు. దీనిపై పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో బాధితులు అదేరోజు ఫిర్యాదు చేశారు. అయితే వివాదంలో ఉన్న యువకులు విద్యార్థులని, కేసు నమోదైతే వారి భవిష్యత్ పాడవుతుందని వారి తల్లిదండ్రులు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి గురువారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దగ్గరకు వెళ్లి విజ్ఞప్తి చేశారు.మహేష్ యాదవ్‌కు క్షమాపణ చెప్పి వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోమని వారికి చెప్పారు. అదే విషయాన్ని మహేష్ యాదవ్‌కు కూడా ఎమ్మెల్యే తెలిపారు. దీంతో రాయన్నపాలెం నుంచి ఈడా పవన్ సురేంద్ర, ఈడా భార్గవ్, మరికొంతమంది శుక్రవారం ఉదయం దెందులూరు వెళ్లారు. అదే అదనుగా మహేష్‌యాదవ్ వర్గీయులు భార్గవ్, పవన్ సురేంద్రలను చుట్టు ముట్టి రాడ్లు, కర్రలతో తీవ్రంగా గాయపర్చారు. అడ్డు వచ్చిన టీడీపీ నాయకులు మన్నే శ్రీనివాసరావు, బొద్దు నరేం ద్రలను తోసివేసి మరీ దాడిచేశారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వెంటనే సంఘటన జరిగిన దెందులూరులోని దాబా దగ్గరకు వెళ్లి క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారకులైన టీడీపీ నాయకుడు, యాదవ కార్పోరేషన్ డైరెక్టర్ మహేష్‌యాదవ్, అతని వర్గీయులపై కఠిన చర్యలు తీసుకోవాలని దెందులూరు ఎస్‌ఐ శివాజీని ఆదేశించారు. శాంతి చర్చలకు పిలిచి దాడిచేసి కొట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇలాంటి వాటిని ఉపేక్షించబోమని, సొంతపార్టీ నాయకులైనా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలని పోలీసులకు సూచించారు. పెదవేగి సీఐ రాజశేఖర్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు కార్పొరేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సమావేశానికి మల్లేశ్వరరావు శుక్రవారం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాంగే, జిల్లా నాయకులు పి.కిషోర్‌లు మాట్లాడుతూ ఎస్‌క్రో అకౌంట్‌ను తక్షణమే తెరవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు వచ్చిన నేపథ్యంలో మీటర్ రీడర్స్‌కు విద్యుత్ శాఖలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి ఆదుకోవాలన్నారు. విద్యార్హతను బట్టి టెక్నికల్, నాన్ టెక్నికల్, షిఫ్ట్ ఆపరేటర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా, మిగిలిన వారికి వాచ్‌మెన్, అటెండర్ పోస్టులను కేటాయించాలన్నారు. రీడర్ల సమస్యలపై ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తుందని చెప్పారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పి.జాకబ్‌లు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు, విద్యుత్ శాఖ అధికారులతో రీడర్స్ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.



జగదీశ్వరిని అభినందిస్తున్న రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఎం.రామ్‌ప్రసాద్, ఎంపీ కేశినేని శివనాథ్

శాప్ సభ్యురాలిగా జగదీశ్వరి

పోలవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) సభ్యురాలుగా పోలవరం మండలానికి చెందిన టీడీపీ నాయకురాలు కొవ్వాసు జగదీశ్వరి శుక్రవారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో జగదీశ్వరిని క్రీడాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌లు అభినందించారు.



విపత్తుల సమయంలో సహాయ కార్యక్రమాలపై మాక్ డ్రిల్ నిర్వహిస్తోన్న ఎస్డీఆర్ఎఫ్, ఎన్‌సీసీ బృందాలు

విపత్తుల నిర్వహణపై ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ

ఏలూరు అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ కేడెట్లకు ఏలూరు సీఆర్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తోన్న వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ , జాతీయ విపత్తు స్పందన దళం ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్, ప్రాక్టికల్ డెమో కార్యక్రమాలు జరిగాయి. భూకంపం, అగ్ని ప్రమాదాలు, వరదల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, బాధితులను సురక్షిత ప్రాంతాలకు చేర్చడంపై లైఫ్ బోట్, జెమినీ బోట్లపై డెమో ద్వారా ప్రదర్శనలు నిర్వహించారు. అత్యాధునిక పరికరాలతో సహాయ చర్యలు ఎలా చేపడతారో చూపించారు.ఇటువంటి శిక్షణతో కేడెట్లలో విపత్తులపై స్పందన, సహాయ కార్యక్రమాలపై అవగాహన ఏర్పడు తుందని, భవిష్యత్తులో ఇతరులకు కూడా మార్గనిర్దేశం చేయగల సామర్థ్యం పెరుగు తుందని క్యాంప్ కమాండెంట్ కల్నల్ విశ్వజిత్ శ్రీవాస్తవ అన్నారు. డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ తీర్థప్రసాద్, లెఫ్టినెంట్ ప్రేమ్‌సాగర్, కార్యాలయ సూపరింటెండెంట్ కొండయ్య, పీఐ స్టాఫ్ పాల్గొన్నారు.

పెనుమాకలంక పంచాయతీలో అవినీతి మాయాజాలం

లక్షల్లో సొమ్ము మాయం
వైసీపీ నాయకుడి ఘనకార్యం
సమాచార చట్టం నివేదికతో గుట్టు రట్టు
టీడీపీ నాయకుల ఆరోపణలు

మండవల్లి జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు మత్స్యకారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వైసీపీ నేతల అండదండలతో వైసీపీ సర్పంచ్ పంచాయతీ నిధులను పక్కదారి పట్టించి జేబులు నింపుకుంటున్న వైనం వెలుగులోకి వచ్చింది. మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామంలో సర్పంచ్ ముంగర నాగరాజుపై విమర్శలు భగ్గుమన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో నేతల అండదండలతో అధికారులను మభ్యపెట్టి ప్రభుత్వ పంచాయతీ సొమ్ములను కాజేసినట్టు పెనుమాకలంక మాజీ సర్పంచ్‌లు ఘంటసాల శ్రీనివాసు, మరియమ్మ, గ్రామస్థులు వెంకటరాజు ఆరోపిస్తున్నారు. శుక్రవారం విలేకరులకు ఆ వివరాలను వెల్లడించారు. పంచాయతీలో జరుగుతున్న అవినీతి తంతుపై సమాచార హక్కు చట్టం ద్వారా జమా ఖర్చులపై నివేదిక అవినీతి గుట్టు రట్టు చేసింది. పంచాయతీలో వచ్చే నిధులతో పాటు కొల్లేరు గ్రామాల్లో ఉండే సమాంతర నిధులను సైతం వినియోగించుకుని కోట్ల అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు.దాదాపు కోటి రూపాయల వరకు ఖర్చు పెట్టగా అందులో భారీగా రూ.80 లక్షలు వరకు అవినీతి జరిగిందని తెలిపారు. సుమారుగా 2010లో చనిపోయిన ఆళ్ల వెంకటేశ్వరరావు 2021-22లో పంచాయతీ పోలింగ్ బూత్ వద్ద బ్లీచింగ్, శానిటేషన్ చల్లినట్టుగా కూలి చెల్లించడం, పీడీఎస్ రాష్ట్ర అధికారికి మామగారైన ఉలమా దావీదురాజు సైతం రక్షిత మంచినీటి పథక మరమ్మతులకు వచ్చినట్లు బిల్లు పెట్టుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మంచినీటి చెరువుకు విద్యుత్ మోటార్లు మూడు రోజులు వాడి నెల రోజులు 5 హెచ్‌పీ ఆయిల్ ఇంజన్లు వాడినట్లుగా లక్షలు బిల్లులు తీసుకున్నారని వివరించారు. పెనుమాకలంక పంచాయతీ రెండు వేల జనాభాతో మైనర్ పంచాయతీ అయినా ఆదాయం మెండుగానే ఉంటుంది. ఆర్థిక సంఘాల నిధులు నేరుగా పంచాయతీలకే జమకావడంతో పాటు చేపలచెరువుల వేలం పాటలు, పన్నులు రూపంలో ఏడాదికి రూ.25 లక్షలు వరకు నిధులు అందుబాటులో ఉంటాయి. దీన్ని అదునుగా చేసుకుని నాలుగేళ్ల వ్యవధిలో రూ.80 లక్షలు వరకు దుర్వినియోగానికి పాల్పడినట్లు వారు వివరించారు. గ్రామం ద్వారా నిధులు తీసుకుని, పంచాయతీలో నిధులు బిల్లు పెట్టి డ్రా చేశారని తెలిపారు. గ్రామంలో జరిగిన అవినీతిపై సర్పంచ్, కార్యదర్శులపై జిల్లా కలెక్టర్‌కి సోమవారం పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు మాజీ సర్పంచ్‌లు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్, వెంకటరాజు

క్రైం సమాచారం

మద్యం మత్తులో దాడి.. ఒకరి మృతి

లింగపాలెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి):మద్యం మత్తులో ఒక వ్యక్తిపై విచక్షణారహితంగా దాడి చేయడంతో మృతి చెందిన ఘటన లింగపాలెం మండలంలో జరిగింది. ధర్మాజీగూడెం ఎస్‌ఐ కె.వెంకన్న, స్థానికులు తెలిపిన వివరాలివి.. ఆసన్నగూడెంకు చెందిన తోకల శోభనాద్రి(85)ని అదే గ్రామానికి చెందిన మోదుగు సంజీవ రావు అనే వ్యక్తి మద్యం మత్తులో వెదురుకర్రతో బలంగా తలపై మూడుసార్లు కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు స్థానికుల సహకారంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సరదాగా కుటుంబంతో గడపాలని వచ్చి..

» ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం

నరసాపురం రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సరదాగా కుటుంబ సభ్యులతో వారం రోజులు గడపాలన్న ఆశతో స్వగ్రామానికి వచ్చిన ఓ ఉద్యోగి ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి పడి దుర్మరణం చెందాడు, రుస్తుంబాద కొత్తకాలవ గట్టున ఈ విషాద ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. కొత్తపల్లి యజ్ఞఫణీంద్ర(29) గుజరాత్‌లో ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారిగా పని చేస్తున్నాడు. మూడు నెలల క్రితం వివాహం జరిగింది. ఈనెల 25న సెలవుపై రుస్తుంబాద వచ్చాడు. ఇంటిపై చెత్త, చెదారం పేరుకుపోవడంతో దాన్ని శుభ్రం చేసేందుకు బిల్డింగ్‌పైకి ఎక్కాడు. రెండు రోజులుగా వర్షం కురవడంతో ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు, కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీనిపై తండ్రి కొత్తపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని రూరల్ ఏఎస్‌ఐ కె.శ్రీనివాసరావు తెలిపారు.

చికిత్స పొందుతూ ముగ్గురి మృతి

ఏలూరు క్రైం/పెంటపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ జిల్లాలో వేర్వేరుచోట్ల పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ముగ్గురు మృతి చెందారు. వివరాలివి.. అనారోగ్యంతో బాధపడుతూ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని మహిళ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. కొంతకాలం నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలోనే ఉంటూ భిక్షాటన చేస్తూ జీవిస్తుంది. ఈనెల 25న ఆ మహిళ (50) అనారోగ్యానికి గురికావడంతో అత్యవసర విభాగం వైద్యులు డాక్టర్ జ్యోతి ఆసుపత్రి లో చేర్పించారు. చికిత్స పొందుతున్న మహిళ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది.

- రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలకు గురై మంగళగిరిలోని ఏఎంసీలో చికిత్స పొందుతున్న మహిళ గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. కోరుకొల్లు గ్రామానికి చెందిన పర్వతాల అమ్మాజీ(48) ఆమె కుమారుడు శరణ్‌కుమార్ కలిసి మోటారు సైకిల్‌పై ఈనెల 7వ తేదీ ఉదయం కోరుకొల్లు నుంచి ద్వారకాతిరుమల వెళ్తున్నారు. మార్గమధ్యలో ఏలూరు రూరల్ మండలం మహేశ్వరపురం వద్ద కుక్క అడ్డురావడంతో ప్రమాదవశాత్తు మోటారు సైకిల్ కుక్కను ఢీకొనడంతో అదుపు తప్పి పడిపోయారు. అమ్మాజీ తలకు బలమైన గాయం కావడంతో తొలుత ఏలూరు ఆంధ్రా ఆసుపత్రికి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం మంగళగిరిలోని ఏఎంసీ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 26వ తేదీ అర్ధరాత్రి మృతి చెందింది. ఈ సమాచారం ఏలూరు రూరల్ పోలీసులకు అందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.
- తాడేపల్లిగూడెం వీకర్స్ కాలనీకి చెందిన మానుపాటి జయరాజు(40) చేపలు, రొయ్యల వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 21న పని నిమిత్తం తాడేపల్లిగూడెం నుంచి పరిమెళ్ళ మీదుగా భీమవరం మోటర్‌సైకిల్‌పై వెళ్తుండంగా పరిమెళ్ళ గ్రామం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. తొలుత తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి, అనంతరం గుంటూరు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ స్వామి తెలిపారు.

విషాదం మిగిల్చిన చేపల వేట



» నీటిగుండంలో మునిగి రెండు కుటుంబాల్లో ముగ్గురి మృతి
» వీరిలో ఇద్దరు అన్నదమ్ములు.. » కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

బుట్టాయగూడెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఇంటివద్ద ఖాళీగా ఉండే కంటే వాగుల వద్దకు చేపల వేటకు వెళితే ఇంటిలో కూర గడుస్తుంది అని వెళ్లిన ముగ్గురు గిరిజన యువకులు తెల్లం సీతారాముడు(30), తెల్లం కిషోర్(21), మడి దేవేంద్రకుమార్(18)లను విధి వక్రీకరించడంతో మృత్యువాత పడిన ఘటన చినరవ్వారిగూడెంలో జరిగింది. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం చినరవ్వారిగూడెంలో రెండు కుటుంబాలకు చెందిన ముగ్గురు యువకులు మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన సీతారాముడు, కిషోర్ అన్నదమ్ములు. శుక్రవారం ఉదయం గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు సీతారాముడు, దేవేంద్రకుమార్, కిషోర్, పండు, అరుణ్ అనే యువకులు చేపలు పట్టేందుకు దండిపూడి సమీపంలోని పోగొండ కొండవాగు దేవరగుండం వద్దకు వెళ్లారు. చేపలను పట్టే ప్రయత్నంలో ఒకరు గుండంలో పడిపోగా అతడిని కాపాడేందుకు మరో ఇద్దరు దిగగా లోతు ఎక్కువగా ఉండడంతో ఈత రాకపోవడంతో ముగ్గురూ మరణించారు. ఈ ఘటనను మరో ఇద్దరు యువకులు కుటుంబ సభ్యులకు తెలపడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఈతగాళ్ల చేత ముగ్గురు శవాలను బయటకు తీయించారు. మరణించినవారిలో తెల్లం సీతారాముడుకు వివాహం కాగా భార్య రజని, చిన్నపాప ఉన్నారు. తెల్లం కిషోర్ డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగం కోసం చూస్తున్నాడు. దేవేంద్రకుమార్ ఈ ఏడాది ఇంటర్ పూర్తిచేసి ఎంసెట్ రాసి కాలేజీలో సీటు కోసం ప్రయత్నం చేస్తున్నాడు. సీతారాముడు, కిషోర్ తల్లిదండ్రులు పోసిరావు, వీరాయమ్మ, భార్య రజనీలు, దేవేంద్రకుమార్ తల్లిదండ్రులు సోమయ్య, పోసమ్మ కుమారుడి కోసం విలపించడం అందరిని కంటనీరు పెట్టించింది. మృతదేహాలను పోస్టుమార్టం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాల కోసం వెదుకుతున్న గజ ఈతగాళ్లు

- ముగ్గురు గిరిజన యువకులు మృతి చెందడంపై రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతిని తెలిపారు. ప్రభుత్వపరంగా బాధిత కుటుంబాలకు సాయం చేస్తామని తెలిపారు.

కిల్లర్ సింహాద్రికి జీవిత ఖైదు

» ప్రసాదంలో సైనేడ్ కలిపి 20 నెలల్లో పది మంది హత్య

ఏలూరు క్రైం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రసాదంలో సైనేడ్ కలిపి పది హత్యలు చేసిన కిల్లర్ సింహాద్రికి విజయవాడలోని ఏడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో ఒక హత్యా కేసులో జీవిత ఖైదు విధించారు. అతడితో పాటు సహకరించిన షేక్ అమినుల్లాబాబుకు జీవిత ఖైదు విధిస్తూ జడ్జి శుక్రవారం తీర్పు చెప్పారు. ఏలూరు పత్తేబాదలోని ఒక అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా ఉండే వెల్లంకి సింహాద్రి అలియాస్ శివ(45) పదో తరగతి చదివాడు. ప్రస్తుతం ఏలూరు వెంకటాపురం పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో ఉంటున్నాడు. తరచూ అతడి అపార్టుమెంట్‌కు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు రావడంతో వారి మాదిరిగా డబ్బు సంపాదించాలని ఆశపడ్డాడు. వారిలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆసరాగా చేసుకుని ప్రసాదం అంటూ ఆ ప్రసాదంలో సైనేడ్ కలిపి ఇచ్చి హతమార్చాడు. 20 నెలల్లో పది మందిని హతమార్చాడు.

ఏలూరులోని ఒక పీఈటీ టీచర్ కాటి నాగరాజు(49)ను సమీపంలోని వట్లూరు మేరీమాత స్తూపం వద్దకు 2019 అక్టోబరు 16న రప్పించి అక్కడ ప్రసాదం ఇవ్వడంతో అది తిని అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా నమోదు చేయగా అప్పటి ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవల్ ఆదేశాలతో అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. చివరకు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా సింహాద్రిని అరెస్టు చేశారు. ఈమేరకు అతడు చేసిన హత్యలు వెలుగులోకి వచ్చాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పేపర్‌మిల్లు వద్ద ఉంటున్న కొత్తపల్లి రాఘవమ్మ అనే వృద్ధురాలు బంధువు కావడంతో అతడి వద్దకు చుట్టం చూపుగా రావడంతో సైనేడ్ ఇచ్చి హతమార్చి లక్ష రూపాయలు నగదు, కొంత బంగారం అపహరించాడు. అదే జిల్లాలో బొమ్మూరులో ఉంటున్న అతడికి వరుసకు వదిన అయ్యే సామంతకుట్టి నాగమణిని ఇదే విధంగా హత్య చేసి ఐదు లక్షల నగదు, నగలతో పరారీ అయ్యాడు. ఏలూరులో తను అద్దెకు ఉంటున్న రాములమ్మ అనే ఆమెను కూడా సైనైడ్‌తో చంపివేశాడు. వెండి, బంగారు వస్తువులు అపహరించాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఒక స్వామీజీని ఆయుర్వేద మందు అంటూ సైనైడ్ ఇచ్చి హతమార్చాడు. చివరకు పోలీసులకు పట్టుబడడంతో 20నెలల్లో 10 హత్యలు చేసి 28 లక్షల 50 వేల రూపాయలు సంపాదించి ఏలూరులో ఒక ఇంటి స్థలం కొని ఇల్లు కట్టేసుకున్నాడు.

విజయవాడలో మోటారు వాహనాల విడిభాగాలకు నికిల్ కోటింగ్ వేసే షేక్ అమనుల్లా అలియాస్ బాబు, అలియాస్ శంకర్ (61)ని తనతో కలుపుకుని అతడి వద్ద నుంచి సైనేడ్ తెచ్చుకుని హత్యలకు పాల్పడడంతో అతడిని కూడా 2019 నవంబరు 5వ తేదీన ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ సింహాద్రి చేసిన పది హత్యలు గుర్తించి వాటిని అప్పటివరకూ అనుమానాస్పదంగా ఉన్నవాటిని హత్య కేసులుగా మార్పు చేసి అరెస్టు చూపించారు. ప్రస్తుతం ఈ కేసులు విచారణ సాగుతున్నాయి.



2019లో సింహాద్రిని అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న అప్పటి ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవల్ (ఇన్‌సెట్‌లో) సింహాద్రి (ఫైల్)

కృష్ణా జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామానికి చెందిన గండికోట భాస్కరరావుకు సైనేడ్ ప్రసాదం ఇచ్చి హతమార్చాడు. అక్కడ పోలీసులు కేసు నమోదు చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు విజయవాడలోని జిల్లా అదనపు సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. వెల్లంకి సింహాద్రి, షేక్ అమినుల్లాబాబులపై నేరం రుజువు కావడంతో వారిద్దరికి జీవిత ఖైదు, ఒకొక్కరికి రూ.25 వేల చొప్పున జరిమానా విధిస్తూ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి బి.అబ్రహం తీర్పు చెప్పారు. 2019లో సంచలనం సృష్టించిన సైనేడ్ సింహాద్రికి శుక్రవారం జీవిత ఖైదు పడడంతో మరోమారు ఏలూరులో చర్చించుకుంటున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తణుకు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ ఆర్టీసీ డిఎం కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు డీఎం గిరిధర్‌కుమార్ తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి 10గంటల వరకు జరిగే కార్యక్రమంలో హైదరాబాదు, తిరుపతి, విజయవాడ సర్వీసులపై ఫిర్యాదులు, సూచనలు తెలియజేయాలని కోరారు. ఫోన్ నంబరు 99592 25484కు తెలియజేయాలని చెప్పారు.

వర్షాకాలంలో జాగ్రత్తలపై అవగాహన

పాలకోడేరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గొరగనమూడి గ్రామంలో వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో ఎక్కువగా తాగునీరు కలుషితమయ్యే అవకాశాలు ఉంటాయని, కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయని, అందువల్ల ముందుగానే తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల తాగునీటి వల్ల వచ్చే వ్యాధులను అరికట్టవచ్చని వైద్య ఆరోగ్య సిబ్బంది అన్నారు. వర్షాకాలంలో నీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు.

కనక దుర్గమ్మకు కుంకుమ పూజలు

పాలకొల్లు అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): యడ్ల బజారులోని కనక దుర్గమ్మను శుక్రవారం వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు చేసుకున్నారు. 800 మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా వాహన పూజలు, చిన్నారులకు అక్షారాభ్యాసాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



అలరించిన కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన

పెనుగొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్ళమ్మ జాతర వేడుకగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీ సాయి నాట్య నిలయం, ఆచంట సాయి కోమలి ప్రదర్శించిన కూడిపూడి, జానపద నృత్య ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్దుల్ని చేశాయి. చిన్నారులు ప్రదర్శించిన ప్రదర్శనలు ఆద్యంతము చప్పట్లతో ప్రజా స్థలి మారుమోగాయి. గతంలో రవీంద్ర భారతిలో ప్రదర్శనకు గాను సాయి కోమలికి నంది అవార్డు, ఈ మధ్యనే ఒంగోలులో ప్రదర్శనకు గాను ఆలిండియా బెస్ట్ పెర్మామెన్స్ అవార్డు కూడా తీసుకున్నానని సాయి కోమలి తెలిపారు.

అన్న సమారాధన

భీమవరం టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): 36వ వార్డు, రామరాజు తోటలో మావుళ్ళమ్మ (చిన మావుళ్ళమ్మ) జాతర ముగింపు సందర్భంగా శుక్రవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మావూరి వెంకట పద్మరాజు (అమ్మ సిల్క్స్) పూజాధికాలు నిర్వహించి ప్రారంభించారు. మావుళ్ళమ్మ సేవాసమితి అధ్యక్షురాలు రామాయణం వెంకటలక్ష్మి తులసి పార్వతి, కార్యదర్శి రేపూరి, గోగురాజు తదితరులు పాల్గొన్నారు.

పెద అమిరంలో డ్రైడే

కాళ్ళ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పెద అమిరంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వి.క్రాంతికుమార్, మండల వైద్యాధికారి సీహెచ్.రంగం నాయుడు హాజరై గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. లార్వా దశలోనే స్ప్రేయింగ్ చేయించి దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.సునీల్, ఎంఎల్‌హెచ్‌పీ స్నేహ, ఏఎన్ఎం రాజకుమారి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలి

తణుకు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి కుటుంబం సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 34మంది లబ్ధిదారులకు 25లక్షల 57వేల705 రూపాయల సీఎం రిలీఫ్ చెక్కులను అందజేశారు.

మానవ అక్రమ రవాణా నేరం

కాళ్ళ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాళ్ళ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మానవ అక్రమ రవాణా నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకివీడు ఐసీడీఎస్ సీడీపీవో వాణి విజయరత్నం మాట్లాడుతూ ఈ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద నేరంగా ఉందన్నారు. ఉద్యోగం, సినిమా అవకాశాల పేరుతో మహిళలను మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారని అన్నారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ తమ పరిధిలో ఉన్న కిశోర్ బాలికలకు అవగాహన కల్పించి రక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తులసి, గ్రీష్మకుమారి, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అనిల్ కుమార్, మిథాలిరాజ్, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని బాలికకు గాయాలు

భీమవరం క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు బాలికలను ఐషర్ వ్యాన్ ఢీకొట్టడంతో ఒక బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. టూటౌన్ ఎస్ఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం 39వ వార్డు లంకపేటకు చెందిన గంటా మావుళ్ళ కుమార్తె లక్ష్మిని ఆమె మేనకోడలు లక్ష్మీదుర్గ శుక్రవారం ఉదయం అంగన్‌వాడీకి తీసుకువెళ్తుంది. కొవ్వాడ సెంటర్ వద్దకు వెళ్ళేసరికి వెనుక నుంచి వస్తున్న ఐషర్ వ్యాన్ నాలుగేళ్ళ బాలిక లక్ష్మీ కాలుపై నుంచి వెళ్ళిపోయింది. ఆ బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. మావుళ్ళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ళ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాళ్ళ మండలం బోస్ కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాలవానితిప్ప, గోగుతిప్ప, ఆనందపురం, ఇస్కులంక, మేకలదిబ్బ, గూట్లపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు.

ఉద్యోగుల దీక్షకు కౌన్సిల్ సంఘీభావం

నరసాపురం టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలంటూ ఐదు రోజులుగా మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది చేస్తున్న దీక్షకు కౌన్సిల్ సంఘీభావం తెలిపింది. కార్యాలయం గేట్ వద్ద చేస్తున్న దీక్ష శిబిరాన్ని చైర్‌పర్సన్ వెంకటరమణ, కౌన్సిలర్లు, సీపీఎం నాయకులు కవురు పెద్దిరాజు వెళ్లి మద్దతు తెలిపారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పీఆర్ స్కేల్ విధానం తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం క్రైం, జూన్ 27(ఆంధ్రజ్యోతి):భీమవరం మండల న్యాయ సేవా సంస్థలో పారా లీగల్ వలంటీర్లుగా పనిచేయాలనే ఆసక్తి గల మాజీ సైనికుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సంస్థ చైర్మన్ డాక్టర్ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. సేవ దృక్పథంతో పనిచేయాలని, దీనికి ఎలాంటి జీతభత్యాలు ఉండవని చెప్పారు. భీమవరం కోర్టు భవనంలోవున్న సంస్థ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు 08816 231133, 99496 14419 నెంబర్లలో సంప్రదించాలి.

ఎండా కాలం పనులు.. వానా కాలంలోనా ?

(5వ పేజీ తరువాయి)

సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. పురపాలక సంఘానికి పెద్ద మొత్తంలో పన్ను చెల్లించకుండా ఉన్న స్కూళ్లకు ఎలా శానిటేషన్ సర్టిఫికెట్‌ను మంజూరు చేశారని టీడీపీ సభ్యులు పాలూరి బాబ్జీ, వైసీపీ సభ్యులు దిలీప్, కాంతమ్మ, వన్నెంరెడ్డి శ్రీను నిలదీశారు. ఇటువంటి స్కూళ్లకు పురపాలక సేవలను నిలిపివేయాలన్నారు. పట్టణంలో తాగునీటి సరఫరా అధ్వాన్నంగా ఉందని నాగిణి, నాని, సురేష్, శ్రీను, దిలీప్‌లు నిలదీశారు. అధికారులు బాధ్యతారహితంగా పని చేయకపోవడం వల్ల పురపాలక సంఘ ఇరవై ఏళ్ల వెనక్కి వెళ్లింది. ఈ కారణంగా ఇక్కడ పనిచేసేందుకు అధికారులు ఎవరూ రావడం లేదన్నారు. పుష్కర పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పతివాడ పద్మ కోరారు.

చుక్క చుక్కలో విషం !

ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏది కాలువ గట్టు, ఏది చెరువు గట్టో అర్థం కావడం లేదన్నారు. కాలువలోని చెత్తా, చెదారాలను తొలగించాలని, గట్టును ఆక్రమించి ఉన్న నిర్మాణాలను తొలగించడంతోపాటు కాలువ గట్టునూ వదలని ఆక్వా చెరువుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి విషయంలో ఎవరు తప్పు చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వెంటనే సంబంధిత రైతులతో మాట్లాడి కాలువ గట్టును నాలుగు నుంచి ఆరు మీటర్ల మేర వెడల్పు చేయాలని అధికారులు, ఆయా పంచాయతీ సర్పంచ్‌లు, నీటి సంఘాల ప్రతినిధులకు ఆదేశాలు జారీచేశారు.




పెంటపాడు మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి.. తణుకులో డ్వాక్రా ఆర్పీలకు ట్యాబ్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

రాజకీయాలకు అతీతంగా గ్రామాలు అభివృద్ధి చేయాలి

పెంటపాడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన సర్వసభ్యసమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ ప్రజలు నమ్మి ఓటు వేస్తే తమకు మంచి చేస్తారని భావిస్తారని ఆ నమ్మకాన్ని ప్రతి ఒక్కరూ నిలబెట్టుకోవాలన్నారు. ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలని గెలిచిన తరువాత ప్రతి ఒక్కరూ ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలన్నారు. దాతలు ఎవరైనా ఉంటే వారితో పీ4 విధానంలో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం మరో మూడు రోజుల్లో రిటైర్డ్ కాబోతున్న ఎంపీడీవో చీకట్ల బాలాజీ వెంకటరమణను సన్మానించారు. కార్యక్రమంలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రభాకర్‌రావు, తహసీల్దార్ రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

తణుకు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మహిళలు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు రూ.30వేల విలువైన ట్యాబ్‌లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు కృషితోనే పరిపాలనలో సాంకేతిక అభివృద్ధి చేశారని అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో 49మంది ఆర్పీలకు రూ.14.70లక్షల విలువైన ట్యాబ్‌లను అందించామన్నారు.

అమెరికాకు పితాని, కరుణాకర్ వడయార్

పెనుమంట్ర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని తెలుగు అసోసియేషన్ నార్త్ అమెరికా (తానా) 48వ వార్షికోత్సవ సభలకు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శుక్రవారం బయలుదేరి వెళ్లారు. తానా మహాసభలు జూలై 3,4,5 తేదీల్లో జరగనున్నాయి. కళాకారులు, సాహితీ వేత్తలు, పొలిటికల్ లీడర్స్, డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, ఆధ్యాత్మికవేత్తలు, ప్రముఖులు హాజరు కానున్నారు. అలాగే నత్త రామేశ్వరం ఏకేఆర్ట్స్ శిల్పి డాక్టర్ పెనుగొండ కరుణాకర్ ఉడయార్‌కు కూడా ఆహ్వానం అందింది. రొబోటిక్ టెక్నాలజీలో 90 అడుగుల పంచలోహ విగ్రహం తయారుచేసిన కరుణాకర్ ఉడయార్‌కు అమెరికాలోని లిబర్టీ విగ్రహం కన్నా ఎత్తయిన అన్నమయ్య విగ్రహం ఇప్పటికే తయారు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికాలోని తానా సభలకు నిర్వాహకులు ఆహ్వానం పంపారని తానా సభలకు హాజరవుతున్నట్టు కరుణాకర్ ఉడయార్ తెలిపారు.

కమ్యూనిస్టు, కార్మిక సంఘాల ఆందోళన



తణుకులో మునిసిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

తాడేపల్లిగూడెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి):కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్ వర్కర్స్ యూనియన్ సమావేశం పట్టణ అధ్యక్షుడు చల్లా చంద్రరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ వల్ల కార్మిక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. వీటిని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న జాతీయ స్థాయిలో చేసే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

తణుకు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు కోరుతూ జూలై 8న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశ వ్యాపిత సమ్మె పిలుపులో భాగంగా తణుకు ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్సు యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, తణుకు మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్సు యూనియన్ అధ్యక్షుడు బొద్దాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో సార్వత్రిక సమ్మెకు మద్దతు

నరసాపురం టౌన్: కార్మికుల సమస్యలపై వచ్చే నెలలో నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలంటూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని తూర్పుతాళ్ళ గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పని గంటలు పెంచడం ఆపాలని తదితర డిమాండ్లపై సమావేశంలో చర్చించారు. సమ్మె రోజున ఆయాలు, అంగన్‌వాడీ సెంటర్లను మూసి సమ్మెలో పాల్గొనాలన్నారు.

సమ్మెకు సీపీఎం మద్దతు

భీమవరం టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 8వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి.గోపాలన్ తెలిపారు. శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి.గోపాలన్ మాట్లాడుతూ లేబర్ కోడ్లు రద్దు, కార్మిక సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. దేశంలో మోదీ ప్రభుత్వం బడా పెట్టుబడిదారుల అనుకూల విధానాలను అమలు చేస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నదని అన్నారు. విశాఖ స్టీల్, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు.



కార్యదర్శులకు సత్కారం

మొగల్తూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పదోన్నతితో బదిలీ అయిన సచివాలయ కార్యదర్శులను సర్పంచ్ పడవల మేరీ సన్మానించారు. మొగల్తూరు పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శులు గంటా సుబ్బారావు, అడ్డాల శ్రీనివాస్, చంద్రశేఖర్, బెల్లంకొండ శ్రీమణికంఠ, పంపన భార్గవ్, బందన నళినీ, ప్రసాద్, దుర్గా ప్రసాద్, పొతుల రవికుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ నవీన్ కిరణ్, పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ బోణం నర్సింహారావు పాల్గొన్నారు.



చెట్ల కొమ్మలు తొలగింపు

మొగల్తూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు లాకుపల్లవపాలెం వద్ద రహదారిపై అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు శుక్రవారం తొలగించారు. మొగల్తూరు మీదుగా ముత్యాలపల్లి వైపు వెళ్ళే ఆర్టీసీ బస్సులు గ్రామంలో 216 జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా లాకుపల్లవపాలెం మీదుగా వెళ్ళే బస్సులను కుక్కలవారితోట మీదుగా మూడు సంవత్సరాల నుంచి డైవర్షన్ చేశారు. రహదారి పనులు పూర్తికావడంతో పాటు లాకుపల్లవపాలెం వద్ద హైవే రోడ్డుకు అప్రోచ్ రోడ్డు నిర్మించడంతో పూర్వ స్థితితో ఆర్టీసీ బస్సులు లాకుపల్లవపాలెం మీదుగా వెళ్ళే పరిస్థితి ఏర్పడింది. అయితే ఆప్రాంతంతో రహదారికి ఇరుపైపుల పెరిగిన చెట్ల కొమ్మల కారణంగా బస్సుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆర్టీసీ అధికారులు చెప్పడంతో శుక్రవారం చెట్ల కొమ్మలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి రహదారిని శుభ్రపరిచారు. దీంతో సుమారు నాలుగు సంవత్సరాలుగా నిలిచిపోయిన రహదారికి బస్సులు తిరిగేందుకు మోక్షం లభించిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



క్షీరా రామలింగేశ్వర స్వామికి ఏపవో పూజలు

పాలకొల్లు అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): క్షీరా రామలింగేశ్వర స్వామిని మునిసిపల్ ఆడిటింగ్ ఆఫీసర్ మధుబాబు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు స్వామివారి శేష వస్త్రాన్ని, స్వామివారి చిత్ర పటాన్ని అందజేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

తణుకు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం 5,6 వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, అతిసారం, టైఫాయిడ్ వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

పీజీ సెట్‌లో చిట్టూరి విద్యార్థులకు ర్యాంకులు

తణుకు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీ సెట్ పరీక్షల్లో చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కాలేజి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ సి.హెచ్. ఏడుకొండలు తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్సులో ఎం.ఎస్.ఇ.నోయల్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. మేఘన 543వ ర్యాంకు సాధించినట్లు వివరించారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీ

తాడేపల్లిగూడెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం భవితా దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్లర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణాధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, ఏడోవార్డు జనసేన ఇన్‌చార్జ్ రంజిత్, నాయకులు పవన్, కళ్యాణి, భవితా కేంద్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు చలో తెనాలి

తణుకు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో దళిత యువకులపై అక్రమ కేసులు బనాయించి బహిరంగంగా లాఠీలతో కొట్టడాన్ని నిరసిస్తూ ఈనెల 28వ తేదీన తెనాలిలో నిర్వహించే చలో తెనాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరూరి మురళీ కుమార్ కోరారు. శుక్రవారం తణుకులో చలో తెనాలి కార్యక్రమానికి సంబంధించిన కర పత్రాలను ఆవిష్కరించారు.

గురుకుల విద్యార్థులకు ర్యాంకులు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పెదతాడేపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు సాధించారు. ఈ ప్రవేశ పరీక్ష ద్వారా ర్యాంకులు సాధించిన ఎస్సీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం దేశంలో పేరుగాంచిన కార్పొరేట్ స్కూల్స్‌లో ప్రవేశం లభించనుంది. ఈ పరీక్షల్లో 140 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 140 మంది అర్హత సాధించినట్టు ప్రిన్సిపాల్ బి.రాజారావు తెలిపారు. ఈ పరీక్షల్లో 9వ తరగతి విద్యార్థులు జి.మహేష్ (903), కె.సుభాష్(1012) ఆలిండియా ర్యాంకులు సాధించినట్టు వివరించారు. వారితోపాటు ఇంటర్ ప్రవేశానికి పరీక్షలో పి.జాయ్ సందీప్(1122), డి.రాజేష్ (1160) ర్యాంకులు సాధించారన్నారు.

సత్యనారాయణకు బీవీ రావు పురస్కారం

పాలకొల్లు అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రంగస్థల కళాకారుడు, పాలకొల్లు కళాపరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి మానాపురం సత్యనారాయణకు మరో పురస్కారం లభించింది. గుంటూరుకు చెందిన ప్రముఖ పౌరాణిక రంగస్థల కళాకారుడు బీవీ రావు స్మారకార్థం ఏర్పాటు చేసిన బీవీరావు కళా సేవా పురస్కారాన్ని గురువారం గుంటూరులో బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అందించినట్టు మానాపురం శుక్రవారం విలేకరులకు తెలిపారు.

మొక్కలు పంపిణీ



ఆకివీడు రూరల్ జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గుమ్ములూరు దివంగత మాజీ సర్పంచ్ కోపల్లె రత్న మాణిక్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె భర్త మాజీ సర్పంచ్ కోపల్లె సాయిబాబా గ్రామంలో పాఠశాలలు, గ్రామస్థులకు మొక్కలు పంపిణీ చేశారు. మృతులు జ్ఞాపకార్థం వస్తువులు ఇవ్వడం ఆనవాయితీ. అయితే దీనికి భిన్నంగా పండ్ల మొక్కలైన జామ, మామిడి మొక్కలు పంపిణీ చేశారు.



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు: జేసీ

భీమవరం టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు పరిష్కారంలో కొన్ని శాఖల అధికారులు నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనబడుతున్నదని వారిపై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు అందిన అర్జీల పురోగతిపై శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి పలుశాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 1100 కాల్ సెంటర్‌కు అందిన అర్జీల పరిష్కారంపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీదారులు పెట్టుకున్న సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో విచారణచేసి పరిష్కరించాలన్నారు.

విద్యార్థుల లక్ష్యం ఉన్నతంగా ఉండాలి



వేంద్ర పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్షణ అధికారి శ్యాంసుందర్

పాలకోడేరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వేంద్ర జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి పి.శ్యాంసుందర్ సందర్శించారు. పాఠశాలలో ముగ్గురు విద్యార్థులను ఎన్‌రోల్ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవీవీ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో అసమానతలను విద్య ద్వారా మాత్రమే తొలగించవచ్చునని విద్యార్థుల లక్ష్యం ఉన్నతంగా ఉండాలని అన్నారు. ఈ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకీ ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం పాఠశాల సైన్స్ లేబొరేటరీ నిమిత్తం రూ. 2 లక్షలు మంజూరు చేసినట్లు శ్యాంసుందర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ చంద్రశేఖర్, ఏఎంఓ సుబ్రహ్మణ్యం, ఎంఈవో శివన్నారాయణ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులతో పశువులకు మేలు



చెరుకుమిల్లిలో మేకలకు మందు వేస్తున్న దృశ్యం

ఆకివీడు రూరల్ జూన్ 27(ఆంధ్రజ్యోతి): పరాన్న జీవుల నుంచి గొర్రెలు, మేకలు రక్తహీనతకు గురై బక్కచిక్కిపోతాయి. ఆరోగ్యం దెబ్బతిని మరణిస్తాయని పశువైద్యాధికారి భార్గవి సత్య తెలిపారు. నట్టల నివారణ మందులు వేయడం వలన జీర్ణశక్తిపెరిగి త్వరగా బరువు పెరుగుతాయని ఆమె తెలిపారు. యేడాదికి నాలుగుసార్లు నట్టల నివారణ మందులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. చెరుకుమిల్లి గ్రామంలో 150 గొర్రెలు, 100 మేకలకు మందులు వేసినట్లు తెలిపారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెంలో నట్టల నివారణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ టి.విజయ్‌కుమార్ 198 జీవాలకు నట్టల మందులు అందించారు. ఈ ఈనెల 26 నుంచి జూలై 10 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.



టీడీపీ నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు

కొత్తోట టీడీపీ కార్యవర్గం

మొగల్తూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు తెలిపారు. శుక్రవారం కొత్తోట గ్రామ తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడుగా కొపనాతి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దాసరి రాంబాబు, ఉపాధ్యక్షుడుగా పూతినేని సత్యనారాయణలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సీఐ రజనీకుమార్ బాధ్యతల స్వీకరణ

గణపవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సీఐగా నక్కా రజనీ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గణపవరంలో ఉన్న సర్కిల్ కార్యాలయంలో నిడమర్రు సీఐగా బాధ్యతలను స్వీకరించి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మానవతకు ఫ్రీజర్ అందజేత

గణపవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జల్లికొమ్మర సర్పంచ్ కురేళ్ల వెంకటరత్నం ఆర్థిక సహకారంతో రూ.85వేలు విలువ గల ఫ్రీజర్‌ను మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మండల మానవత అధ్యక్షుడు బుద్దారపు పుల్లయ్య, మాజీ అధ్యక్షులు కాళ్లకూరి సత్యనారాయణమూర్తి, బొడ్డు శ్రీనివాసరావు, ఎం.చిరంజీవి పాల్గొన్నారు.